క్లుప్తంగా

రెవెన్యూ మంత్రిని కలిసిన ఎమ్మెల్యే యరపతినేని



పిడుగురాళ్ల: రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను గురజాల నియోజకవర్గ శాసన సభ్యులు యరపతినేని శ్రీనివాసరావు గురువారం సచివాలయంలోని ఆయన చాంబర్‌లో కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర సచివాలయంలో బాధ్యతలను చేపట్టిన మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యరపతినేని నిఖిల్ తదితరులు ఉన్నారు.

నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం

గురజాల : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు గురువారం అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించడం జరుగుతుందని భారతీయ జనతా పార్టీ నాయకులు తెలిపారు. స్థానిక వాగ్దేవి డిగ్రీ కళాశాలలో ఉదయం 6.30 గంటలకు యోగా దినోత్సవం నిర్వహించడం జరుగుతుందని అనంతరం అల్పాహారం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

బడి బయట పిల్లలను గుర్తించాలి

ఎంపీడీవో రామకృష్ణానాయక్

గురజాల : బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి వెంటనే వారిని పాఠశాలల్లో చేర్చే విధంగా చర్యలు చేపట్టాలని ఎంపీడీవో బి.వి.రామకృష్ణానాయక్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 'నేను బడికి పోతా' కార్యక్రమంలో భాగంగా అధికారులతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 6–14 సంవత్సరాల వయస్సు గల చిన్నారులను గుర్తించి వారు పాఠశాలల్లో ఉండేలా చూడాలన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రతి ఒక్క చిన్నారి విధిగా బడికి వెళ్లేలా ప్రోత్సహించాలన్నారు. జూలై 12వ తేదీ నాటికి వంద శాతం బడి ఈడు పిల్లలను బడిలో చేర్చే విధంగా చేయడమే ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే వసతులు గురించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ అన్నదాత మోహన్ శ్రీనివాస్, సీడీపీవో షేక్ రుక్సానా సుల్తానా బేగం, ఎంఈవోలు కె.కాంతారావు, సాంబశివరావు, తదితరులు ఉన్నారు.

కౌలు రైతులు సీసీఆర్సీ కార్డులు పొందాలి

ఏవో కె.రావమ్మ

మాచవరం: కౌలు రైతులు కౌలు రైతు కార్డులను పొందాలని ఏవో కె.రావమ్మ తెలిపారు. మండలంలోని ఆకురాజుపల్లి గ్రామంలో కౌలు రైతులకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కౌలు రైతులు ఆయా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో కౌలు రైతు కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు. దీని వలన ప్రభుత్వం నుంచి అందే సహాయం, పథకాలు అందుతాయని ఆమె అన్నారు. ఈ అవకాశాన్ని రైతులు తప్పనిసరిగా ఉపయోగించుకోవాలని ఆమె పేర్కొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగుల అదనపు బాధ్యతలు తొలగించాలి

సీఐటీయూ మండల కార్యదర్శి తెలగపల్లి శ్రీనివాసరావు

పిడుగురాళ్ల: పట్టణంలోని ఆర్టీసీ డిపోలో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల అదనపు బాధ్యతలను తొలగించాలని సీఐటీయూ మండల కార్యదర్శి తెలగపల్లి శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని ఆర్టీసీ డిపోలో డిపో మేనేజర్‌కు వినతిపత్రాన్ని సీఐటీయూ నాయకులు గురువారం అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ... ఆర్టీసీ డిపోలో స్వీపర్లుగా పని చేస్తున్న మహిళల చేత డిపో నుంచి బస్టాండ్ వరకు 20 లీటర్ల క్యాన్‌ను మోయిస్తున్నారని, ఇది సరైన పద్ధతి కాదని వారు తెలియజేశారు. అదే విధంగా కాంట్రాక్టర్‌కు ఫోన్ చేయగా ఆయన క్యాన్‌లు మోయాల్సిన అవసరం లేదని అన్నారన్నారు. అంతే కాకుండా కాంట్రాక్ట్ ఉద్యోగుల వేతనాల్లో కోతలు విధిస్తున్నారని ఇది సరైన పద్ధతి కాదని వెంటనే కార్మికుల పట్ల డీపో మేనేజర్, కాంట్రాక్టర్ వ్యవహరిస్తున్న తీరు మార్చుకోకపోతే ఉద్యమిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంపత్ వెంకట కృష్ణ, బుంగా నాగేశ్వరరావు, శేషారావు తదితరులు ఉన్నారు.

విద్యుత్ శాఖ స్పెషల్ డ్రైవ్

మాచర్ల: విద్యుత్ శాఖ మాచర్ల డివిజన్ పరిధిలో పట్టణంతోపాటు రూరల్ ప్రాంతాల్లో గురువారం విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎ.రామయ్య ఆధ్వర్యంలో మరమ్మతుల పనులు జరిగాయి. వర్షాలు, గాలులకు ఇటీవల పలు ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు పడిపోవడం, తీగలు తెగిపడడం వంటివి జరిగిన నేపథ్యంలో గురువారం విద్యుత్ శాఖ సిబ్బంది స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పట్టణంతోపాటు, రూరల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేసి చెట్లు నరకడంతోపాటు, లైన్ల మరమ్మతులు చేపట్టారు. విద్యుత్ సిబ్బంది బృందాలుగా ఏర్పడి మరమ్మతులు చేశారు.

పచ్చని పచ్చిక మాటున ప్రమాదం

- విషసర్పాల కాలం.. జర జాగ్రత్త
- పంటల సాగులో రైతులకు పొంచి ఉన్న ప్రమాదం
- పొలాల గట్లపై విషసర్పాల సంచారం
- పాము కాటుకు గురైతే తక్షణమే డాక్టర్‌ని సంప్రదించాలి



సాగులో ఉన్న పచ్చని వరి పైరు (ఫైల్)

దాచేపల్లి : విష సర్పాల ప్రమాదం అన్నదాతలకు పొంచి ఉంది. పంట సాగులో రైతన్నలు హడావుడిగా పొలంలో తిరుగుతున్న సమయంలో పాము కాటుకు గురయ్యే ప్రమాదం లేక పోలేదు. పొలాల్లో రైతన్నలు కాస్త అప్రమత్తంగా ఉంటే విషసర్పాల ముప్పు నుంచి సురక్షితంగా తప్పించుకోవచ్చు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావటంతో రైతు లు పొలం పనుల్లో పూర్తిగా నిమగ్నమయ్యారు. ఇప్పటివరకు ఎండ తీవ్రత అధికంగా ఉండటం వలన విషసర్పాలు భూమిలోనే ఎక్కువగా తలదాచుకున్నాయి. తాజాగా తొలకరి వర్షాలు కురవటం.. వాతావరణం కూడా చల్లబడటంతో విషసర్పాలు బయట సంచారం చేసే అవకాశం మెండుగా ఉంది. పచ్చని పచ్చిక మాటున పాముల సంచారం ఎక్కువగా ఉంటుంది. రైతులు పొలం గట్లపై, పొలంలో అడుగులు వేసేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రమాదవశాత్తూ విషసర్పాల కాటుకు గురైతే తక్షణమే డాక్టర్‌ని సంప్రదించి వైద్య సేవలు పొందాలి.

అప్రమత్తంగా ఉండాలి

తొలకరి వర్షాల కారణంగా రైతులు ఇప్పటికే పొలం పనుల్లో ఎక్కువగా గడుపుతున్నారు. తొలకరి వర్షాలతో పంటల సాగుతో పాటు ఎండిపోయిన చెట్లకు లేత చిగుర్లు వచ్చి పచ్చదనం సంతరించుకుంటుంది. మనిషికి పాము అంటే భయం.. పాముకి కూడా మనిషి అంటే అంతకంటే ఎక్కువ భయం ఉంటుంది. ఆ భయంతోనే మనిషిని కోరలు చాచి కాటేస్తుంది. పొలం పనుల్లో నిమగ్నమైన రైతులు, రైతు కూలీలు పాము కాటుకు గురైన సందర్భాలు అనేకం ఉన్నాయి. పాము కాటుకు గురైన తరువాత సకాలంలో వైద్యం అందక మృత్యువాత పడిన వారు కూడా ఉన్నారు.

రైతులు, రైతు కూలీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

వ్యవసాయ పనులు ముమ్మరంగా జరుగుతుండటంతో పొలాలకు వెళ్లే రైతులు తప్పనిసరిగా చేతి కర్ర వెంట తీసుకెళ్లాలి. పొలంలో, పొలం గట్లపై నడుచుకుంటూ వెళ్లేటప్పుడు కర్రతో శబ్దం చేస్తే విషసర్పాలు పక్కకు వెళ్తాయి. ధాన్యపు గాదెలు, గడ్డివాములు తడిగా ఉండే చోట కప్పలు, ఎలుకలు సంచరిస్తుండటంతో వాటి కోసం పాములు వస్తాయి. కట్టెలు, దుంగలు, పచ్చిక బయళ్లలో కూడా పాముల సంచారం అధికంగా ఉంటుంది. అన్నదాతలు రాత్రి సమయాల్లో పొలాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉంటే తప్పనిసరిగా టార్చిలైట్ వెంట తీసుకెళ్లాలి. ఇళ్ల మధ్యలో చెత్తచెదారం, ముళ్ల పొదలు, శిథిలావస్థలో ఇళ్లు, కట్టెలు నిల్వ చేసి ఉన్నట్లయితే పాములు వాటిలో నివసించే అవకాశం ఉన్నది.



ప్రభుత్వ వైద్యశాలల్లో అందుబాటులో ఉన్న యాంటీ స్నేక్ వీనం ఇంజక్షన్

పాము కాటు లక్షణాలు ఇలా...

పాము కాటుకు గురైన వ్యక్తులు ఆందోళన చెందకుండా సమీపంలోని వైద్యశాలకు వెళ్లాలి. పాము కాటుకు గురైన వ్యక్తి ఆందోళన చెందితే గుండెపోటు బారిన పడే ప్రమాదం ఉంది. విషం ఉన్న పాము కాటు వేసిన చోట రెండు కోరల గాయం స్పష్టంగా కనిపిస్తుంది. నొప్పి తట్టుకోలేకపోతారు. నొప్పి క్రమంగా కింద నుంచి పైకి వ్యాపిస్తుంది. తిమ్మిరి తిమ్మిరిగా ఉండటంతో పాటుగా గొంతు, కండరాలు బిగుసుకున్నట్లుగా.. నాలుక మందమైనట్లుగా.. గొంతులో ఏదీ మింగని పరిస్థితి ఉంటుంది. నోటిలో నుంచి నురుగ కారుతుంటుంది. కళ్లు మగతగా ఉంటాయి.

ధైర్యమే పాము కాటుకు ప్రథమ చికిత్స

పాము కాటు వేసిన దానికంటే కూడా భయపడటం వలనే ప్రాణాల మీదకు తెచ్చుకుంటారు. పాము కాటుకు గురైన వ్యక్తికి ధైర్యం చెప్పటమే ప్రథమ చికిత్సలాంటిది. సూమారు 15 నుంచి 20 పాములకు(త్రాసుపాము, కట్లపాము, రక్త పింజర) మాత్రమే విషం ఉంటుంది. పాము కరిచిన వెంటనే విషంపైకి ఎక్కకుండా బలంగా కట్టుకట్టాలి. నాటు వైద్యం జోలికి వెళ్లకుండా సమీపంలోని ఆస్పత్రికి వెళ్లి వైద్య సేవలు పొందాలి. పాము కాటుకు గురైన వ్యక్తిని నడిపించకూడదు. సాధ్యమైనంత వరకు ఎత్తుకుని వాహనంలో కుర్చోబెట్టి తీసుకెళ్లాలి. వైద్యశాలకు వెళ్లిన తరువాత విషం విరుగుడు ఇంజక్షన్ చేయటం ద్వారా మనిషి ప్రాణాలు సురక్షితంగా ఉంటాయి.

పాము కాటుకు తక్షణం వైద్యం పొందాలి



పాము కాటుకు గురైన వ్యక్తికి తక్షణం వైద్య సేవలు అందాలి. పాము కాటుకు గురైన వ్యక్తి భయపడకుండా ధైర్యంగా హాస్పిటల్‌కి రావాలి. పాము కాటుకి గురైన వారి కోసం ప్రభుత్వ వైద్యశాలలో యాంటీ స్నేక్ వీనం ఇంజక్షన్లు అందుబాటులో ఉన్నాయి. తాచుపాము, రక్తపింజరి వంటి విషసర్పాలు కాటు వేస్తే రెండుగాట్లు పడతాయి. ఈ పాములు కాటు వేయటం వలన దంతాల ద్వారా కోరల్లోకి విషం వచ్చి గాట్ల ద్వారా శరీరంలోకి ప్రవేశిస్తుంది. 90 శాతం పాముల్లో విషం ఉండదు. యాంటీ స్నేక్ వీనం ఇంజక్షన్ వేయటం ద్వారా విషానికి విరుగుడు జరుగుతుంది. నాటు వైద్యం జోలికి వెళ్లవద్దు.

– డాక్టర్ ఇమ్మడిశెట్టి అమూల్య, పీహెచ్‌సీ వైద్యురాలు, దాచేపల్లి

టమాటా పంట ధ్వంసం



వివరాలు సేకరిస్తున్న ఎస్‌ఐ ఆంజనేయులు

రెంటచింతల: మండల పరిధిలోని రెంటాల గ్రామంలో గురువారం తెల్లవారుజామున గుర్తు తెలియని కొందరు వ్యక్తులు టమాటా పంటను ధ్వంసం చేసిన ఘటన జరిగింది. గ్రామానికి చెందిన పెద్దకోట్ల నరేంద్ర సాగు చేస్తున్న టమాటా పంటను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ ఎం.ఆంజనేయులు ధ్వంసం చేసిన పంటను పరిశీలించి భాదితుడి నుంచి వివరాలు సేకరించారు. తాను నెల రోజుల కిందట రెంటచింతలలోని ఓ నర్సరీ నుంచి ఒక మొక్క రూపాయి చొప్పున 20 వేల మొక్కలను కొనుగోలు చేసినట్లు ఇప్పటి వరకు కూలీలకు, పొలం సాగు ఖర్చు కలిపి మొత్తం సుమారు రూ.50 వేల వరకు పెట్టుబడి పెట్టినట్లు నరేంద్ర ఎస్‌ఐకు వివరించారు. భాదితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపారు.

కౌలు రైతుల గుర్తింపు చట్టానికి సవరణ చేయాలి

కౌలు రైతు సంఘం ప్రతినిధులు

ఎర్రబాలెం(క్రోసూరు): భూ యజమానులతో సంబంధం లేకుండా కౌలు రైతులను గుర్తించే విధంగా చట్ట సవరణ చేయాల్సిన అవసరం ఉందని కౌలు రైతు సంఘం ప్రతినిధులు కోరారు. గురువారం మండలంలోని ఎర్రబాలెం రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయాధికారి వేణుగోపాల్, తహసీల్దార్ ఎం.సువర్ణ ఆధ్వర్యంలో కౌలు కార్డులపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పల్నాడు జిల్లా కౌలు రైతు సంఘం కమిటీ సభ్యులు తిమ్మిసెట్టి హనుమంతరావు మాట్లాడుతూ 2019లో కౌలు రైతు సాగుదారుల చట్టం అమలు చేస్తూ గ్రామాలలో కౌలు రైతు గుర్తింపు కార్డు పొందాలంటే భూ యజమానులు సంతకం చేయాలనే నిబంధన పెట్టటం వలన గ్రామాల్లో 20–30 శాతం మంది మాత్రమే కౌలు కార్డులు పొందారన్నారు. ఈ రకంగా కౌలు రైతులు కార్డు తీసుకునే దగ్గరే ఆగిపోవటం జరుగుతుందన్నారు. దీంతో ఈ క్రాప్ బుకింగ్ ద్వారా పంట విక్రయాలు, పంట నష్టపరిహారం, బీమా పొందటంలో కౌలు రైతులు తీవ్రంగా నష్టపోవటం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ కార్డుల కొరకు అర్జీ పెట్టుకున్న కౌలు రైతుకు యజమానితో ఏదైనా సమస్య వస్తే తాము పరిష్కరిస్తామని, దేవుడి మాన్యం సాగు చేసుకునే రైతులకు కూడా ఈవో ద్వారా గుర్తింపు కార్డులు మంజూరు చేస్తామన్నారు. కావున కౌలు రైతులు కౌలు కార్డులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



మలేరియా మాసోత్సవ ర్యాలీలో ఆరోగ్య సిబ్బంది, విద్యార్థులు

రాజుపాలెం: వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మలేరియా పర్యవేక్షకులు, హెల్త్ సూపర్‌వైజర్ జీవన్‌రావు అన్నారు. మండలంలోని కొత్తబోధనంలో పాఠశాల విద్యార్థులతో కలసి మలేరియా నివారణ మాసోత్సవ ర్యాలీ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్త్ సూపర్‌వైజర్ మాట్లాడుతూ మలేరియా వ్యాధి దోమల వలన ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందుతుందని తెలిపారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం అందరి భాధ్యత అని అన్నారు. ఇంటి పరిసరాలలో మురికి నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. పరిసరాలలో ఉన్న రోళ్లు, పాత టైర్లలో నిల్వ ఉన్న నీటిని ఎప్పటికప్పుడు తొలగించాలని, సాయంత్రం వేళల్లో వేపాకు పొగ వేయడం వలన దోమలను నివారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠవాల హెచ్‌ఎం లీలావతి, ఎంఎల్‌హెచ్‌పీ అన్నాకుమారి, ఏఎన్‌ఎం ప్రమీలాభాయి, ఆశా కార్యకర్తలు రెబ్బమ్మ, ఈశ్వరమ్మ, మద్దెమ్మ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అర్హత కలిగిన కౌలు రైతులు దరఖాస్తు చేసుకోవాలి



అబ్బూరులో మాట్లాడుతున్న వీఆర్వో మరియదాసు పక్కన వీహెచ్‌ఏ పవన్‌కుమార్

సత్తెనపల్లి: భూమి కౌలుకు తీసుకుని పంటలు సాగు చేస్తున్న కౌలు రైతులు పంట సాగు హక్కు పత్రాల (సీసీఆర్సీ కార్డులు) కోసం దరఖాస్తు చేసుకోవాలని గ్రామ రెవెన్యూ అధికారులు డి.మరియదాసు, ఎంటీ నాగేశ్వరరావు, కె.నాగమణి, జె.గోపి, ఎం.లలిత శివజ్యోతిలు అన్నారు. అర్హత కలిగిన కౌలు రైతులకు పంట సాగు హక్కు పత్రాలు మంజూరు చేయుటకు సత్తెనపల్లి మండలం అబ్బూరు, ఫణిదం-1, ఫణిదం -2, బట్లూరు, భీమవరం గ్రామాల్లో గురువారం నిర్వహించిన అవగాహన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. కౌలు రైతులు దరఖాస్తు చేసుకున్న ఫారాలను ఆన్‌లైన్ చేసి మండలాధికారులకు అందించడం జరుగుతుందన్నారు. అనంతరం అర్హులైన కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులను అందించడం జరుగుతుందన్నారు. ఆయా సమావేశాల్లో వ్యవసాయ శాఖ వీహెచ్‌ఏలు డి.వి.డి.పవన్‌కుమార్, బి.వెంకటేశ్వరరావు, మండూరి షేక్ షెహనాజ్, షేక్ చాందిని, జె.యాకోబు, కౌలు రైతులు, తదితరులు ఉన్నారు.

తారక్‌నాథ్ సేవలు ప్రశంసనీయం



మాచర్ల: స్టేట్‌బ్యాంక్ ఉద్యోగుల యూనియన్ నాయకుడు తారక్‌నాథ్ వర్ధంతి పురస్కరించుకుని మాచర్ల పట్టణంలోని స్టేట్‌బ్యాంక్ మెయిన్ బ్రాంచ్ మేనేజర్ కృష్ణారెడ్డి, స్వామి వివేకానంద చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో చిన్నారులకు స్కూల్ యూనిఫామ్, పుస్తకాలు పంపిణీ చేశారు. వృద్ధులకు అల్పాహారం అందజేశారు. కృష్ణారెడ్డి, స్వామి వివేకానంద చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు మెట్టు గోవిందరెడ్డి మాట్లాడుతూ తారక్‌నాథ్ పేదలకు పలు సేవా కార్యక్రమాలు చేశారన్నారు. చిన్నారులకు బ్యాంకు ద్వారా సేవా కార్యక్రమాలు అందజేశారని గుర్తు చేశారు. తారక్‌నాథ్ సేవలకు గుర్తుగా ప్రతి సంవత్సరం పేదలకు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ నాయకుడు ఆంజనేయులు, బ్యాంకు ఉద్యోగులు ఎం.శ్రీనివాసులు, భాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అమ్మ చేయూత చారిటబుల్ సంస్థ సేవలు అభినందనీయం

సత్తెనపల్లి: అమ్మ చేయూత చారిటబుల్ స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయమని బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ నాయకులు చింకా అంకమ్మరావు అన్నారు. క్యాలిబర్ జానీ మనవడు షేహజాద్ స్కూల్‌లో జాయిన్ అయిన సందర్భంగా గురువారం పట్టణంలోని రైల్వేస్టేషన్, తాలూకా సెంటర్‌లో అన్నార్తులకు అమ్మ చేయూత చారిటబుల్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. అంకమ్మరావు మాట్లాడుతూ అమ్మ చేయూత చారిటబుల్ స్వచ్ఛంద సంస్థకు దాతల సహకారం మరువలేనిదన్నారు. దాతల సహకారంతో మరెన్నో సేవా కార్యక్రమాలు కొనసాగించాలన్నారు. సంస్థ ప్రెసిడెంట్ కె.దస్తగిరి, సభ్యులు పిక్కిలి రత్తయ్య, ప్రత్తిపాటి హరేకృష్ణ, కందుల అంబేడ్కర్, తోడేటి సుభాష్ చంద్రబోస్‌లు ఉన్నారు.

ప్రీ స్కూల్ గ్రాడ్యుయేషన్ డే నిర్వహణ



ముప్పాళ్ల: అంగన్‌వాడీ ప్రాజెక్టు సత్తెనపల్లి పరిధిలో గల ఇరుకుపాలెం సెక్టారులో దమ్మాలపాడు అంగన్‌వాడీ కేంద్రంలో ఐదేళ్లు నిండిన పిల్లలకు ప్రీ స్కూల్ గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం గురువారం జరిగింది. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జి.విజయలక్ష్మి పాఠశాల హెచ్‌ఎం నాసరయ్య, ఉపాధ్యాయులు జి.ఆశాలత, అంగన్‌వాడీ కార్యకర్తలు టి.పద్మావతి, డి.బుజ్జి రాణి, టి.ప్రమీల, డి.రమాదేవి, సీహెచ్ సుమలత, ఎల్.శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

'నేను బడికి పోతా' విజయవంతం చేయాలి

ఎంఈవో–2 వై.శివనాగేశ్వరరావు



హెచ్‌ఎంల సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో-2 శివనాగేశ్వరరావు

రెంటచింతల: గ్రామ, మండల లెవల్ కమిటీలను హెచ్‌ఎంలు సమన్వయం చేసుకుని నేను బడికి పోతా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంఈవో–2 వై.శివనాగేశ్వరరావు అన్నారు. గురువారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో పెదప్రోలు శంకర్‌రావు అధ్యక్షతన 36 ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 18 నుంచి జూలై 12 వరకు నిర్వహించే ఓఎస్‌సీ సర్వేను విజయవంతం చేయాలని కోరారు. మండల పరిధిలో నున్న 11 గ్రామాలలో ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బడి ఈడు పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించి చైతన్యవంతులను చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల, గ్రామ కమిటీలు సమష్టిగా గ్రామ పంచాయతీ కార్యదర్శి, వలంటీర్, ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసిస్టెంట్లు గ్రామంలోని ఇంటింటికి వెళ్లి బడికి పోకుండా ఉన్న బడి ఈడు పిల్లలను గుర్తించాలన్నారు. గుర్తించిన పిల్లల వివరాలను హెచ్‌ఎంలు ప్రతి రోజు స్థానిక ఎంఈవో కార్యాలయంలో అందజేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో పెదప్రోలు శంకర్‌రావు, ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల హెచ్‌ఎం సింహాద్రి మోహన్, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో భూసారం పెంచుకోవచ్చు



గ్రామ వ్యవసాయ సహాయకుల సమావేశంలో మాట్లాడుతున్న ఏవో బోయపాటి బ్రహ్మారెడ్డి

రెంటచింతల: సేంద్రియ ఎరువులైన పచ్చిరొట్ట పంటలు పిల్లిపెసర, జీలుగ, జనుము పంటలను వేసి భూమిలో కలియదున్ని రైతులు భూ సారాన్ని పెంచుకోవచ్చని మండల వ్యవసాయ అధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి అన్నారు. గురువారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ సహాయకులకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు పలు రకాల పంటలను సాగు చేసే సమయంలో జీవన ఎరువుల వాడకం వలన ఎన్నో ప్రయోజనాలు పొందవచ్చని అవగాహన కల్పించాలన్నారు. సాగు చేస్తున్న పంటలకు జీవన ఎరువుల వినియోగం వలన 20 శాతం వరకు ఖర్చు తగ్గుతుందని రైతులకు వివరించాలని సూచించారు. రసాయన ఎరువులను అధికంగా వాడడం వలన భూమిలో ఉన్న సేంద్రియ కర్బనం తగ్గుతుందని, దీంతో పంట పొలంలో భూసాంద్రత గణనీయంగా తగ్గి పంటల దిగుబడి తగ్గిపోతుందని రైతులకు వివరించాలన్నారు. సాగు భూమిలో సూక్ష్మ పోషకాలైన మెగ్నీషియం, జింక్, ఇనుము, కాల్షియం లోపాలు ఉన్నా వాటిని పరిష్కరించుకోవడానికి మెగ్నీషియం సల్ఫేట్, జింక్ సల్ఫేట్ మూడు, నాలుగు సార్లు పిచికారీ చేసుకోవాలని తెలిపాలన్నారు. వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారుల సూచనలతో పంటలను సాగు చేసుకోవాలని రైతులకు సూచించాలన్నారు. వివిధ రకాల తెగుళ్లు, పురుగుల బారి నుంచి తట్టుకునే వంగడాలు, పంట మార్పిడి, యాజమాన్య పద్ధతులను అమలు చేసినప్పుడే అధిక దిగుబడులను సాధించవచ్చని రైతులలో చైతన్యం తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ వార్షికోత్సవం



గుండ్లపాడులో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి మూలవిరాట్



అన్నదానం చేస్తున్న దృశ్యం

వెల్దుర్తి: మండలంలోని గుండ్లపాడు గ్రామంలో వేంచేసియున్న శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ 7వ వార్షికోత్సవం గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు బండికట్ల మహేష్ స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు తెల్లవారుజాము నుంచే స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా శ్రీమద్విరాట్ పోతులూరి బ్రహ్మేంద్రస్వామి, గోవిందమ్మల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం స్వామి వారి ఉత్సవ విగ్రహాలను గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు అందజేశారు.

'వెన్న'కి గుంటూరు మిర్చి యార్డు ఛైర్మన్ పదవి ఇవ్వాలి

టీడీపీ మండల నాయకుల డిమాండ్



సమావేశంలో పాల్గొన్న మండల టీడీపీ నాయకులు

బెల్లంకొండ: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వెన్న సాంబశివరెడ్డికి గుంటూరు మిర్చి యార్డ్ ఛైర్మన్ పదవి ఇచ్చి, సముచిత స్థానం కల్పించాలని బెల్లంకొండ టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మండల పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలుగా పార్టీలో కీలక నేతగా వ్యవహరిస్తూ అధిష్టానం, అధినేత చంద్రబాబు నాయుడు ఆదేశాలను తూచా తప్పకుండా ఆచరిస్తూ 2004, 2009లో పెదకూరపాడు టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి స్వల్ప తేడాతో ఓటమి చెందినప్పటికీ కార్యకర్తలకు అన్నీ తానై నిత్యం అండగా ఉన్నారన్నారు. నియోజకవర్గాన్ని టీడీపీ కంచుకోటగా నిలపడంలో క్రియాశీలక పాత్ర పోషించిన సాంబశివరెడ్డికి గుంటూరు మిర్చి యార్డ్ చైర్మన్ పదవిని కేటాయించాలన్నారు. 2014లో అధికారంలో ఉన్నప్పుడు మరో రెండు నెలల్లో ఎన్నికలు ఉన్నాయనగా 2019లో కేవలం రెండు నెలల ముందు గుంటూరు మిర్చి యార్డ్ చైర్మన్ పదవిని ఇచ్చారని గుర్తు చేశారు. పార్టీ కోసం అన్నీ కోల్పోయిన వెన్న సాంబశివరెడ్డికి తిరిగి గుంటూరు మిర్చి యార్డ్ చైర్మన్ పదవిని ఇచ్చి పార్టీ గౌరవించాలని కోరారు. ఈ సమావేశంలో గ్రామ సర్పంచి గడ్డిపర్తి జ్యోతి సముద్రం, టీడీపీ నాయకులు వెన్న సీతారామరెడ్డి, పీఎస్కే రసూల్, సయ్యద్ జానీ, మాజీ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ సత్యం, హుస్సేన్, సలాం, బద్దూరి వీరారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ మునగపాటి సుభానీ, సీతయ్య తదితరులు పాల్గొన్నారు.

బస్‌షెల్టర్ నిర్మాణానికి భూమి పూజ

అచ్చంపేట: మండలంలోని పలు గ్రామాల నుంచి వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రయాణికుల సౌకర్యార్థం స్నేహహస్తాలు ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక పీహెచ్‌సీ ముందు బస్‌షెల్టర్ నిర్మాణానికి గురువారం భూమి పూజ నిర్వహించారు. సంస్థ ఫౌండర్, ప్రవాసాంధ్రులు ఎంవీ రావు భార్య రాజ్యలక్ష్మి, సంస్థ గౌరవ సలహాదారు మామిళ్లపల్లి విజయలక్ష్మిలు బస్‌షెల్టర్ నిర్మాణానికి శంకుస్థాపన, భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యలక్ష్మి మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో విద్యాభివృద్ధికి, సేవా కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. మండల కేంద్రమైన అచ్చంపేటలో బస్‌షెల్టర్ లేకపోవడం వల్ల దూరప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులు, ఉన్నత విద్యకు వచ్చే విద్యార్థులు ఎండలకు, వానలకు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వారి అవస్థలు చూడలేక బస్‌షెల్టర్ నిర్మించాలని ఆలోచన చేశామన్నారు. 30 అడుగుల పొడవు, 15 అడుగుల వెడల్పుతో బస్‌షెల్టర్ నిర్మాణానికి రూ.5 లక్షలు అవుతుందని అంచనా వేసినట్లు చెప్పారు. గతంలో తమ సంస్థ ద్వారా రోకటిగుంటవారిపాలెం అడ్డరోడ్డు వద్ద, క్రోసూరు మోడల్ స్కూలు వద్ద బస్‌షెల్టర్స్ నిర్మించినట్లు చెప్పారు. నిరుపేద విద్యార్థులకు ఆసరాగా ఉంటూ, విద్యాభివృద్ధికి తమ వంతు కృషి చేస్తున్నామన్నారు. అందుకు విద్యా శాఖ, స్థానిక పెద్దల సహాయ సహకారాలు అందజేస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి ఆర్.నరసింహారావు, వైద్యాధికారి డాక్టర్ రాజేష్, సంస్థ కో ఆర్డినేటర్ తాయి కరిముల్లాబాబు, చెరుకుంపాలెం గ్రామాభివృద్ధి సంఘ అధ్యక్షులు తుమ్మా కౌరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
90100 01840 (పిడుగురాళ్ళ)
97053 46588 (మాచర్ల)
Office mail : sakshigntadvt@gmail.com